www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 14 జూలై 2023



పోలీస్ స్టేషన్ పనులు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

స్థానిక పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సంబంధిత అధికారులకు సూచించారు. మండల పరిషత్ పాఠశాల-1 వెనుక చేపడుతున్న స్టేషన్ నిర్మాణ పనులను, కమ్మరి కోడులో చేస్తున్న మెరక పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మెరక పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ నెల 18 తర్వాత శంకుస్థాపన చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. శంకుస్థాపన అనంతరం పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ల యాదవ్, చేబోయిన వీర్రాజు సిఐ వైవిఆర్.నాయుడు, ఎస్ఐ టి.రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి చెరువు వద్దు.. చేపల చెరువే ముద్దు..!



సీతారామపురం అగ్రహారంలో తాగునీటి చెరువు పక్కన తవ్వుతున్న చేపల చెరువు

కలిదిండి మండలం ఎస్ఆర్పి అగ్రహారంలో తాగునీటి చెరువు పక్కన చేపల చెరువు తవ్వకం

తాగునీటి వనరులను కాపాడుకునేందుకు జనం పోరుబాట

నిలదీస్తున్న గ్రామస్తులపై అక్రమ కేసుల బనాయింపు

కోర్టు స్టే ఉన్నా అధికార బలంతో ముందుకు

ఎంఎల్ఎ కనుసన్నల్లోనే అంతా అంటూ విమర్శలు

డెల్టాలో తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. గుక్కెడు నీళ్ల కోసం జనం పాట్లు వర్ణనాతీతంగా మారాయి. ఆక్వా చెరువుల కాలుష్య నీటితో కేన్సర్, కిడ్నీ సమస్యలు జనాన్ని వెంటాడుతున్నాయి. దీంతో మా గ్రామంలో ఉన్న ఒక్క తాగునీటి చెరువునీ దెబ్బ తీయొద్దంటూ కలిదిండి మండలం ఎస్ఆర్పి అగ్రహారం ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. చెరువు తవ్వకూడదని కోర్టు స్టే ఉన్నా అధికార బలంతో ముందుకు సాగుతున్న నాయకులను అడ్డుకోకుండా అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం కావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిబంధనలకు విరుద్ధంగా సాగించిన చేపల చెరువుల తవ్వకాలతో డెల్టా ప్రజలు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్నారు. ఇక అక్కడక్కడా మిగిలి ఉన్న తాగునీటి చెరువులను సైతం ధ్వంసం చేసేందుకు అడ్డగోలుగా చేపల చెరువుల తవ్వకాలకు అధికార పార్టీ నాయకులు పూనుకున్నారు. కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం సీతారామపురం అగ్రహారంలో నెలకొన్న పరిస్థితే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఎస్ఆర్పి అగ్రహారంతోపాటు చుట్టుపక్కల ఉన్న కట్టావారిపాలెం, పరసావానిపాలేనికి చెందిన మూడు వేల మందికి ఉపయోగపడే ఏడెకరాల తాగునీటి చెరువు అది. అక్కడ ఉన్న పంపుల ద్వారా వచ్చే నీటిని తాగునీటికి, చెరువులో నీటిని రోజువారీ అవసరాలకు అక్కడి ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. తాగునీటి చెరువులకు సమీపంలో చేపల చెరువులు తవ్వకూడదని నిబంధనలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల అండతో కొంతమంది నిబంధనలు తుంగలో తొక్కి తాగునీటి చెరువు పక్కనే 30 ఎకరాల్లో చేపల చెరువు తవ్వేందుకు పూనుకున్నారు. దీన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆందోళనకు దిగి తహశీల్దార్‌కు సైతం వినతిపత్రం అందించారు. చేపల చెరువు తవ్వకం నిలుపుదల చేయాలని కోర్టు స్టే సైతం ఇచ్చింది. అయినప్పటికీ చేపల చెరువు తవ్వి తీరుతామన్నట్లు చెరువు తవ్వకందారులు వ్యవహరిస్తున్నారు. ఇదంతా స్థానిక ఎంఎల్ఎ అండతోనే జరుగుతుందని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేపల చెరువుతవ్వకం వద్దంటూ ఆందోళనకు దిగిన గ్రామస్తులపై అక్రమ కేసులు బనాయించి దారికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్తుల మధ్య చిచ్చుపెట్టి తమ చేపల చెరువు తవ్వకం పని పూర్తి చేయాలనే దుర్మార్గపు ఆలోచనలు సైతం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. చేపల చెరువు పూర్తయితే ఏడెకరాల తాగునీటి చెరువు పూర్తిగా కలుషితం కానుంది. భవిష్యత్తులో వాడకానికి కూడా నీళ్లు లేకుండా పోనున్నాయి. అదే జరిగితే మూడు వేల మంది ప్రజానీకం పరిస్థితి అత్యంత భయానకంగా మారనుంది.

ప్రేక్షక పాత్రలో అధికారులు

ఎస్ఆర్పి అగ్రహారంలో తవ్వుతున్న చేపల చెరువుతో తాగునీటి చెరువు ధ్వంసం అవుతుందంటూ ప్రజలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు. కోర్టు స్టే ఉన్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకులకు చట్టాలు వర్తించవా అంటూ అంతా ప్రశ్నిస్తున్నారు. తమ గ్రామ సమస్యపై ఆందోళన చేసే ప్రజలపై అక్రమ కేసులు పెట్టడం అత్యంత దారుణమనే చర్చ సాగుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల జోక్యం చేసుకుని తాగునీటి చెరువును కాపాడాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి చెరువు పక్కన చేపల చెరువు తవ్వకంపై చర్యలు తీసుకోవాలి

ఎస్.మహంకాళిరావు, సిపిఎం మండల కార్యదర్శి

మండలంలో చాలా గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి చెరువులు దెబ్బతిన్నాయి. ఫౌండేషన్ నీరు కొనుగోలు చేస్తేనే గొంతు తడిచే పరిస్థితి ఉంది. తాగునీటి కాలుష్యంతో కేన్సర్, కిడ్నీ వంటి రోగాలు పెరుగుతున్నాయి. ఎస్ఆర్పి అగ్రహారంలో తాగునీటి చెరువు పక్కన చేపల చెరువు తవ్వకుండా అధికారులు చర్యలు తీసుకుని తాగునీటి వనరులను కాపాడాలి.



బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరువాగు

జిల్లాలో విస్తారంగా వర్షాలు

ఏజెన్సీలో కుండపోత

పొంగిపొర్లుతున్న కొండవాగులు

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో గురువారం విస్తారంగా వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఏకథాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. రోడ్లపై భారీగా వర్షపునీరు చేరింది. ఏజెన్సీ మండలాల్లో భారీవర్షం కురిసింది. కొండ వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహించాయి.

జీలుగుమిల్లి :మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల వాగులువంకలు పొంగిపొర్లుతున్నాయి. జీలుగుమిల్లి నుంచి బర్రింకలపాడు వెళ్లే రహదారిపై అశ్వారావుపేట వాగు ఉధృతంగా ప్రవహించడంతో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా వంకవారిగూడెం వెళ్లే రహదారిపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. అదే విధంగా పలుచోట్ల కొండవాగుల గుండా వరద నీరు పొంగిపొర్లుతుంది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఇదే భారీ వర్షమని మండల ప్రజలు చెబుతున్నారు. వరి నారు మడుల్లోకి నీరుచేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బుట్టాయగూడెం : మండలంలో భారీ వర్షం కురిసింది. కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. కన్నాపురం దగ్గరలోని కల్వర్టు, రెడ్డిగణపవరం సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం ఇవి ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పట్టెన్నపాలెంలో నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలేనికి, బుట్టాయగూడెం మండలం రామారావుపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో పలుచోట్ల వంతెన నిర్మాణాలు చేపట్టాలని దీర్ఘకాలంగా ప్రజలు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ప్రతిసంవత్సరం వర్షాకాలంలో ఇలాంటి తప్పడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం : మండలంలో గురువారం తెల్లవారుజామన ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం ప్రధాన సెంటర్లు, బెస్తావీధిలో డ్రెయినేజీ అస్తవస్తంగా ఉండడంతో వర్షపునీరు నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

ఉధృతంగా జల్లేరు వాగు.. నిలిచిన రాకపోకలు

జంగారెడ్డిగూడెం : బుధవారం రాత్రి నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పట్టెన్నపాలెంలోని జల్లేరువాగు ఉధతంగా ప్రవహిస్తుంది. గురువారం ఉదయానికి వాగు ఉధృతి పెరగడంతో ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఉధృతంగా ప్రవహించిన వాగు సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ వాగు దాటే మార్గం ధ్వంసం కావడంతో వాహనాలు వాగు దాటే అవకాశం లేక బుట్టాయగూడెం మీదుగా రాకపోకలు సాగించాయి. జల్లేరుపై వంతెన నిర్మాణం పూర్తయ్యి ఉంటే ఈ అవస్థలు తప్పేవని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



జంగారెడ్డిగూడెంలో జల్లేరువాగు ఉధృతి

ముదినేపల్లి : మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షానికి జనజీవనం స్తంభించింది. తెల్లవారుజామున మొదలైన వాన ఉదయం 10 గంటల వరకు పడుతూనే ఉంది. దీంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లన్నీ బురదతో చిత్తడిగా మారాయి. వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. లోతట్టు కాలనీల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు అసౌకర్యానికి గురయ్యారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. వర్షానికి కొనుగోలుదారులు రాకపోవడంతో చిరువ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు.

చింతలపూడి : పట్టణంలో విస్తారంగా వర్షం కురిసింది. స్థానిక ఎరుకులపేటలో డ్రెయినేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు రోడ్డుపైకి చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి ఎడతెరపకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు అవస్థలు పడ్డారు.

కల్వర్టును అభివృద్ధి చేయండి : కెవిపిఎస్

బుట్టాయగూడెం : వర్షానికి రెడ్డిగణపవరం వద్ద కల్వర్టు తూరల్లోకి భారీగా చెత్త చేరడంతో నీళ్లు కల్వర్టు పైనుంచి ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ కల్వర్టును ఆయన గురువారం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రానికి వెళ్లేందుకు, జిల్లాలోని జంగారెడ్డిగూడెం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి అని, తక్షణం సమస్యను పరిష్కరించాలని కోరారు. వర్షాకాలం వస్తే ఈ ప్రాంతంలోని కొండవాగుల వల్ల ఏజెన్సీలో రాకపోకలు స్తంభిస్తాయని, అత్యవసర సమయంలో ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కల్వర్టులను, రోడ్లను అభివృద్ధిని చేయాలని కోరారు. ఆయనతోపాటు డప్పు కళాకారుల సంఘం నాయకులు ఉండ్రాజవరం గంగరాజు ఉన్నారు.



జీలుగుమిల్లి వద్ద అశ్వారావుపేట వాగులో చిక్కుకున్న లారీ

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపండి

యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను తక్షణం నిలుపుదల చేయాలని, న్యాయబద్ధంగా బదిలీలు, ప్రమోషన్లు పొందినవారికి జీతభత్యాలు చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.ముస్తఫా అలీ అధ్యక్షత వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో సుమారు 80 వేల మంది దరఖాస్తు చేయగా అందులో 52 వేల మంది అర్హత పొందారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు ముందు 200 సిఫారసు బదిలీలు చేయడం ద్వారా మొత్తం బదిలీల ప్రక్రియ అపహాస్యానికి గురైందని ఉపాధ్యాయులు విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ బదిలీల్లో అన్యాయం జరిగిన వారికి స్థానాల కేటాయింపులో విపరీతమైన జాప్యం చేస్తున్న డిఇఒ ప్రభుత్వ సిఫారసు బదిలీలకు మాత్రం వెంటనే పోస్టింగ్ ఇస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. బదిలీల బాధితులకు జిల్లాలో చిట్టచివర స్థానాలు కేటాయిస్తూ ప్రభుత్వ బదిలీలు పొందిన వారికి మాత్రం వారు కోరుకున్న స్థానాలను బ్లాక్ చేసిన వాటిని సైతం ఓపెన్ చేసి కేటాయించడం దారుణమన్నారు. జిల్లా కోశాధికారి ఆర్.రంగమోహన్ మాట్లాడుతూ బదిలీలతో పాటు నిర్వహించిన ప్రమోషన్లలో ప్రమోషన్ కోరుకున్న సీనియర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేసినా అధికారులు పెడచెవిన పెట్టారని, బదిలీల జాబితాలో ప్రమోషన్ పొందిన వారి పేర్లు చివరన చేర్చి సుదూర ప్రాంతాలకు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా వారు తీవ్రఇబ్బందులకు గురయ్యారని విమర్శించారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు మాట్లాడుతూ బదిలీల తర్వాతే ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్వహించిన ప్రమోషన్ కౌన్సెలింగ్‌లో మంచిస్థానాలు జూనియర్లకే కేటాయించారని, ప్రమోషన్ కౌన్సెలింగ్‌లో నిర్వహించిన అధికారుల వైఖరి సీనియర్లకు అన్యాయం జరిగిందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వి.కనకదుర్గ మాట్లాడుతూ బదిలీలు జరిగి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకూ ఉపాధ్యాయ కేడర్స్ స్ట్రెంగ్త్ నిర్ధారించలేదని, చేపట్టిన సర్దుబాటు ప్రక్రియలో 137 కంటే తక్కువ విద్యార్థులను 500 హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు, పిఇటి పోస్టులు తొలగించారని, అప్‌డేట్ చేసిన సుమారు 1500 హైస్కూళ్లకు ప్రధానోపాధ్యాయులను కొత్తగా ఇచ్చారని ప్లస్‌టు హైస్కూళ్లలో 1746 మంది పీజీ టీచరను నియమించారని వీరికి ఇప్పటి వరకూ జీతాల సమస్యను పరిష్కరించలేదన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి.నరసింహారావు మాట్లాడుతూ కొత్తగా నియమించిన ఎంఇఒ-2లకు డ్రాయింగ్ పవర్, ఎంయు-1లకు ఎఫ్ఎసి ఇవ్వకపోవడంతో 50 వేల మంది ఉపాధ్యాయులకు జూన్ నెల జీతభత్యాలు ఇప్పటి వరకూ చెల్లింపు కాలేదని, వెంటనే చర్యలు తీసుకుని విద్యాశాఖ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఇ.శివశంకర్, ఎస్.సుధారాణి, ఎన్.రాంబాబు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు, ఏలూరు డివిజన్ వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు



ప్రమాదంలో నుజ్జయిన టాటాఏస్, పక్కన టిప్పర్

దూసుకొచ్చిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్/ముసునూరు

లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన బుధవారం పెదవేగి మండలం జానంపేట సమీపంలో జరిగింది. మృతుల్లో ఒకరు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఉన్నాడు. ఈ ఘటనకు సంబంధించి పెదవేగి ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముసునూరు మండలం యల్లాపురానికి చెందిన జున్నూరి బాలకృష్ణ, తాడిగడప రాజాగణేష్ టాటాఏస్ వాహనంలో తమ్మిలేరునుంచి ఇసుకను ఏలూరుకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున టాటాఏస్ వాహనంలో ఇసుకను తీసుకుని ఏలూరుకు బయలుదేరారు. జానంపేట వద్దకు రాగానే ఎదురుగా టిప్పర్ అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటాఏస్ వాహనంలో ఉన్న తాడిగడప రాజాగణేష్(22), జున్నూరి బాలకష్ణ(27) అక్కడికక్కడే మృతిచెందారు. లారీ అతివేగానికి ఇద్దరూ టాటాఏస్ క్యాబిన్‌లో చిక్కుకుని ప్రాణాలొదిలారు. వీరి మృతదేహాలను స్థానికుల సాయంతో బయటకు తీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలకృష్ణకు భార్య, ఏడాదిన్నర, ఏడునెలల ఇద్దరు ఆడపిల్లలున్నారు. రాజాగణేష్ పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వీరి మృతితో రెండు కుటుంబాలలో విషాదఛాయలు అలముకున్నాయి. కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.



రాజాగణేష్ (ఫైల్)



బాలకృష్ణ (ఫైల్)

అసైన్డ్ భూచట్ట సవరణతో పేదలకు అన్యాయం

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఏలూరు

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం వల్ల భూస్వాములకు, పెత్తందారులకు మాత్రమే ప్రయోజనం జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించింది. ఈ సందర్భంగా ఏలూరులోని అన్నే వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఎం.జీవరత్నం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. అసైన్డ్ భూపంపిణీ సమయంలో లబ్ధిదారుల ఎంపికను అసైన్‌మెంట్ కమిటీలోనే నిర్ణయించాలని కోరారు. అయితే అలాంటి కమిటీలేవీ లేకుండానే సమావేశాలు నిర్వహించి ఏకపక్షంగా నిర్ణయించడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ విషయాలను అసైన్డ్ కమిటీలో చర్చించాలని డిమాండ్ చేశారు. యాజమాన్య హక్కులు కల్పించడం వల్ల పెత్తందారులకు, భూస్వాములకు, అధికార పార్టీ నేతలకు ప్రయోజనం చేకూరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది హడావుడిగా పేదలకు భూ పంపిణీ చేసేందుకు ఒక వ్యూహం ప్రకారం రాష్ట్రంలో వేలాది ఎకరాల భూములను ప్రభుత్వం తన ఆధీనంలో తెచ్చుకుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూదందా జాబితాలో అసైన్డ్ భూములు చేరిపోతున్నాయని, దీనివల్ల దళిత గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1954 తర్వాత పేదలకు భూ పంపిణీ చేసి అసైన్డ్ భూములపై 20 ఏళ్ల కాలపరిమితి విధిస్తూ యాజమాన్య హక్కులు కల్పించేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేయడం ఆందోళన కలిగిస్తుందన్నారు. పేదలకు జీవనాధారంగా ఉన్న ఈ భూముల సాగుకు అవసరమయ్యేలా సౌకర్యాలు కల్పించాలని కోరారు. వ్యవసాయానికి అనుకూలంగా లేకపోతే ఈ భూములను భూస్వాములు, పెట్టుబడిదారులు పేదల నుండి దౌర్జన్యంగా బలవంతంగా లాక్కొని అనుభవిస్తున్నారని, వాటిలో ఫ్యాక్టరీలు కడుతున్నారని తెలిపారు. జిల్లాలో లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు స్థానికేతర భూస్వాములు స్థానిక భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములను బినామీల పేర్లతో దర్జాగా అనుభవిస్తున్నారని తెలిపారు. ఉదాహరణకు దెందులూరు మండలంలో దోసపాడు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో సుమారు 150 ఎకరాలకుపైగా అసైన్డ్ భూములను భూస్వాములు కుమ్మక్కై చేపలు, రొయ్యల చెరువులు తవ్వి దర్జాగా అనుభవిస్తున్నప్పటికీ రెవెన్యూ శాఖ అధికారులు, జాయింట్ కలెక్టర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏడాది నుంచి దోసపాడులో దళితులు, పేదలు వారి భూముల కోసం పోరాడుతున్నప్పటికీ భూస్వాముల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరుతున్నా అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. దీనిపై గత 15 ఏళ్ల నుండి పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించ కపోవడం దుర్మార్గమన్నారు. ఈ జిల్లాలో టి.నరసాపురం, చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, నూజివీడు నియోజకవర్గం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో లక్షలాది ఎకరాలు అసైన్డ్ భూములు నేటి భూస్వాముల ఆక్రమణలోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అసైన్డ్ భూముల చట్టసవరణ వల్ల పేదలకు, దళితులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.ముత్యాలమ్మ, ఎస్.మహంకాళి, వై.నాగేంద్రరావు, సహాయ కార్యదర్శి టి.సత్యనారాయణ, ఎం.సుధారాణి, ఆర్.డానియేలు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో 'వైస్ ఛాన్సలర్ టు విలేజ్'

నూజివీడు రూరల్:మండలంలోని పోతిరెడ్డిపల్లిలో 'మామిడి పరిశోధనా సంస్థ వైస్ ఛాన్సలర్ టు విలేజ్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా 2023-24 సంవత్సరానికి గ్రామాన్ని దత్తత తీసుకున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి మాట్లాడుతూ రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచి తగరం సుజాత, శాస్త్రవేత్త జి.స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో రాష్ట్రం అధోగతి : డిఎన్ఆర్

మండవల్లి:టిడిపి హాయంలో రాష్ట్రం అధోగతి పాలైందని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు(డిఎన్ఆర్) అన్నారు. మండవల్లి సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లిలో ఇల్లులేని నిరుపేదలను గుర్తించి భూమిని కొనుగోలు చేసి 290 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించి ఇల్లు నిర్మించుకునేలా చేశామన్నారు. 14 నెలలపాటు సాగిన జగనన్న సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాలు 99 శాతం అమలు చేసి అర్హులందరికీ ఇచ్చారని తెలిపారు. మిగిలిన ఒక శాతం అర్హులకు కూడా పథకాలను అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, వైస్‌ఎంపిపి ఎ.ఆదివిష్ణు, సర్పంచి మెండా జాన్సీ, ఉప సర్పంచి జొన్నలగడ్డ నాగలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయ సమీపంలోని సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెవరూ ప్రవేశపెట్టలేదన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేనను గెలిపించాలి

ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలంటే జనసేనను గెలిపించాలని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో జన సైనికులు, వీర మహిళలతో పవన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ జనసేన ఆశయాలను ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లో అవినీతి పేరుకుపోయిందని, అడ్డగోలుగా దోచుకుంటున్న వారికి జనసేన తగిన బుద్ధి చెబుతుందని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్ర, ప్రముఖ నిర్మాత భోగవల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

దువ్వ వద్ద ఘనస్వాగతం

అలంపురం నుంచి తణుకు చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు దువ్వ గ్రామంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు ఆధ్వర్యాన కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా కమ్మ కళ్యాణ మండపానికి చేరుకున్నారు.



రక్తదానం చేస్తున్న ప్రజలు..

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 21 మంది రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 21 మంది ప్రజలు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి పినిపే విశ్వరూప్, దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి హాజరై మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి జిల్లా పరిషత్ ఛైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, పిఆర్ఒ కెవి రమణ, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుబ్బా రాంబాబు ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - పోలవరం

ఆర్యవైశ్య మహాసభ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులుగా పోలవరం మండలం ఎల్లండిపేట గ్రామానికి చెందిన గుబ్బా రాంబాబు ఎంపిక పట్ల గురువారం ఎల్లండిపేట ఆర్యవైశ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుబ్బా రాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కోన శ్రీనివాస్, ఏలూరు జిల్లా అధ్యక్షులు గూడవల్లి వాసుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లండిపేట గ్రామంలో ఆర్యవైశ్య నాయకులు మోత్కూరి శివ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, మాతు సాంబశివరావు, కపిలవాయి సత్యనారాయణ, పండు స్వామి, మాతు షణ్ముఖానందరావు ఈ సందర్భంగా గుబ్బా రాంబాబుకి అభినందనలు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో వున్నాయని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60 టన్నులు యూరియా, 15 టన్నులు డిఎపి, 30 టన్నులు కాంప్లెక్స్ ఎరువులు మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాలలో వున్నాయని తెలిపారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద సంప్రదించాలని ఆయన కోరారు.

శారద పుష్పావతి సేవలు ఆదర్శం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అంగన్‌వాడీ వర్కర్ కొల్లా శారద పుష్పావతి సేవలు ఆదర్శమని తిరుమలాపురం గ్రామ సర్పంచి కనుపర్తి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కోడ్ నెంబర్ 53లో 39 సంవత్సరాలుగా అంగన్‌వాడీ వర్కర్‌గా సేవలు అందించి, ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీ వర్కర్ శారద పుష్పావతి దంపతులను ఘనంగ సత్కరించారు. కోడ్ నెంబర్ 52 అంగన్‌వాడీ వర్కర్ షేక్ మేరీ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచి కనుపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో 39 సంవత్సరాలు మహిళలు, చిన్నారులతో మమేకమై ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను లబ్ధిదారులకు చేర్చి అందరి మన్ననలు పొందిన కొల్లా శారద పుష్పావతి సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ముందుగా షేక్ మేరీ, వీరన్నగూడెం అంగన్‌వాడీ వర్కర్ కుర్రు కోమలిక పుష్పావతి సేవలను సమావేశానికి వివరించి పుష్పావతి, మాణిక్యాలరావు దంపతులను సత్కరించారు .ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వేముల రత్నకుమారి, కో ఆప్షన్ ఎంపిటిసి షేక్ లాల్ అహ్మద్, సొసైటీ అధ్యక్షులు రాజులపాటి అన్నవరం, సచివాలయ కార్యదర్శి జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గొడుగువారి గూడెం సమీప తండాకు చెందిన అజ్మీర్ చిన్న కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు సేవించి బుధవారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన కుటుంబీకులు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నెలకొందని వైద్యులు తెలిపారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

భీమడోలు: కోళ్లమాంసం వ్యర్థాలను మేతగా రవాణా చేస్తున్న మినీ వ్యాన్‌ను భీమడోలు పోలీసులు గురువారం సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెదపాడు మండలం నాయుడు గూడెం గ్రామానికి చెందిన ఆలపాటి సురేంద్ర ఒక మినీ వ్యాన్ యజమాని. ఆయన వాహనంపై డ్రైవర్‌గా వసంతవాడ గ్రామానికి చెందిన సిరారపు ప్రభుదేవ పనిచేస్తున్నారు. వీరిరువురు ఖమ్మం, దాని పరిసర ప్రాంతాల్లో సుమారు 7 టన్నుల కోడి మాంసం వ్యర్థాలను సేకరించి ఆగడాలంక దాని పరిసర ప్రాంతంలో గల చేపల చెరువులకు మేతగా తరలించేందుకు మినీ వ్యాన్‌లో రవాణా చేస్తూ, గుండుగొలను శివారు పోతునూరు రోడ్లో తనిఖీలు నిర్వహిస్తున్న భీమడోలు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు పట్టుబడ్డారు. ఈ ఘటనలో మినీవ్యాన్ యజమానితో పాటు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు శిక్ష

రూ. 3 లక్షల జరిమానా

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలో చెక్కు బౌన్స్ కేసుకు సంబంధించి గురువారం శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇవ్వడంతో సంచలనంగా మారింది. దండమూరి విజయ్ కుమార్ ఇచ్చిన అప్పు తీర్చమని కోరగా కుప్పాల సంపత్ కుమార్ చెక్కు అందించారని అకౌంట్లో డబ్బు లేనందున చెక్కు బౌన్స్ అయిందని విజయకుమార్ కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం సంపత్ కుమార్‌కు 6 నెలలు జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ జడ్జి వేల్పుల కృష్ణమూర్తి తీర్పు ఇచ్చారు.

గంజాయి సరఫరాదారుల అరెస్ట్

నూజివీడు రూరల్: నిషేధిత మత్తు పదార్థం గంజాయిని సరఫరా చేస్తున్న వ్యక్తులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ టి.గోపాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నూజివీడు హనుమాన్ జంక్షన్ ప్రధాన రహదారిలో గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం అందడంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సూరేపల్లికి చెందిన షేక్ షరీఫ్, నూజివీడుకు చెందిన కాండ్రేగుల శామ్యూల్ రాజుతో పాటు 17 ఏళ్ల వయసుగల మైనర్ బాలుడు వద్ద 700 గ్రాముల గంజాయి దొరికినట్లు సమాచారం. దీంతో సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. నిందితులు తెలిపిన సమాచారం ప్రకారం వారికి గంజాయి సరఫరా చేసిన నూజివీడు ఎంఆర్ అప్పారావు కాలనీకి చెందిన పసుపులేటి వెంకటేష్, వ్యాపారం చేస్తున్న బట్టగాని దీపక్ బాబులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలు నుంచి గంజాయి, నాటుసారా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందుతుందన్నారు. ఎవరైనా అటువంటి చర్యలు పాల్పడితే 9440902462 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

సార్వా సాగుకు ఆదిలోనే హంసపాదు..!

కష్టాలతోనే రైతులు సమాయత్తం..
దెబ్బతిన్న విత్తనాలు
సమృద్ధిగా నీరందించాలంటున్న రైతులు
వెదజల్లే పద్ధతిలోనే వరిసాగు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వర్షం కురిస్తే అతివృష్టి, లేకుంటే అనావృష్టి అన్నట్టు.. వర్షం కురిసినా, కురవకపోయినా ఖరీఫ్ సాగుకి కష్టాలతోనే రైతులు సమాయత్తం అవుతున్నారు. రైతులకు ఖరీఫ్ కష్టాలు ఎదుర్కొనడం తప్పడం లేదు. ప్రతిఏటా జూన్ మొదటి వారంలో తొలకరి వర్షం కురిసిన తర్వాత రైతులు వరిసాగుకు సన్నద్ధమవుతుంటారు. కాని ఈసారి మాత్రం వరిసాగుకు సరిపడా వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతు సాగుకు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా విత్తనాలు వెదజల్లేందుకు మెట్టదుక్కులు సిద్ధం చేసి గ్రామాల్లో వెదజల్లే పద్ధతిలో ఖరీఫ్ సాగును చేపట్టారు. మరికొన్ని గ్రామాల్లో నారుమడులు వేశారు. మండల వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగును రైతులు చేపట్టారు. ఇందులో 8,200 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో రైతులు సాగు చేపట్టాగా, సూమారు 6వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు 400 ఎకరాల్లో రైతులు నారుమడులు పోశారు. వర్షాభావం, తీవ్ర ఎండలతో వెదజల్లిన విత్తనాలు పొట్లుపోయి మొలకెత్తకపోవడంతో రైతులు మళ్లీ దుక్కులు దున్ని విత్తనాలు వెదజల్లారు. పలు ప్రాంతాల్లో వెదజల్లిన చేల్లో మొలకశాతం తక్కువగా రావడంతో రైతులు మళ్లీ నారుమడులు పోస్తున్నారు.



మొలకశాతం తగ్గిన చేలు

దీని ప్రభావంతో రైతులకు సాగు ఖర్చులు రెట్టింపయ్యాయి. ఆగస్టు నెల మొదటి వారానికి గాని మండలంలో నాట్లు పూర్తయ్యే పరిస్థితి కనబడడంలేదు. కాల్వలకు నీరు విడుదల చేసినా, కాల్వల సామర్థ్యానికి తగ్గ నీరు అధికారులు విడుదల చేయకపోవడంతో కాల్వల శివారు గ్రామాలకు నీరు చేరలేదు. కాల్వలకు నీరు విడుదల చేసి నెలరోజులు గడుస్తున్నా కొన్ని గ్రామాల్లో నేటికి మంచినీటి చెరువుల్లో నీరు నింపలేదు. కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే ఇటు తాగునీటి చెరువులు నింపుకోవడానికి, అటు ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా చేసేందుకు అవకాశం ఉంది. నాట్లు గనుక ఆలస్యం అయితే నవంబర్, డిశంబర్ నెలల్లో వచ్చే తుఫాన్ల భారిన పంటలు పడి రైతులు నష్టపోయే అవకాశం ఉంది.



ఎండలకు విత్తనాలు మాడిపోయి మొలకెత్తని చేను

ఎండలకు విత్తనాలు మొలకెత్తలేదు..

-కౌలు రైతు కంచర్ల కృష్ణారావు, ముదినేపల్లి



జూన్‌నెల మొదటి వారంలో విత్తనాలు వెదజల్లాం. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో తీవ్రమైన ఎండలకు వెదజల్లిన విత్తనాలు మాడి, పొట్టుపోయాయి. దీంతో విత్తనాలు మొలకరాలేదు. మళ్లీ దుక్కలు దున్ని రెండోసారి విత్తనాలు వెదజల్లాం.

మళ్లీ నారుమడులు వేశా..

కె.చంటి కౌలు రైతు, ముదినేపల్లి



చేలో విత్తనాలు జల్లి 25 రోజులు అయ్యింది. ఎండలతీవ్రతకు భూమిలో ఉడుకు వచ్చి విత్తనాలు మొలకశాతం తగ్గింది. మళ్లీ నారుమడి వేశాను. దీంతో రెట్టింపు ఖర్చు అయ్యింది.

గోపవరం వికలాంగునికి ట్రిపుల్ ఐటిలో సీటు

ప్రజాశక్తి - నిడమర్రు



మానసిక వికలాంగుడైన దేవర గోపవరం గ్రామానికి చెందిన కొమ్మన వెంకట కృష్ణవంశీ నూజివీడు(రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం) ట్రిపుల్ ఐటి కాలేజీలో మానసిక వికలాంగుల విభాగంలో సీటు సంపాదించినందుకు పలువురు అభినందించారు. కృష్ణవంశీ పదవ తరగతిలో 388 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం నిడమర్రు మండలం విద్యాశాఖ అధికారులు పుచ్చల శేషు, కె.రాంబాబు, పెద్ద నింద్రకొలను జడ్‌పిహెచ్ ప్రధానోపాధ్యాయులు పివి.సత్యనారాయణ, బావయపాలెం జడ్‌పిహెచ్ స్కూల్ ఎస్ఎ స్పెషల్ ఎడ్యుకేటర్ విప్పర్తి సుబ్బారావు, సహిత విద్య ఉపాధ్యాయులు ఏసు రాజు, ఇసుకపాటి లక్ష్మీకాంతం, ఇజ్జురోతు వరలక్ష్మి వెంకట కృష్ణవంశీను అభినందించారు.

నేడు సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ముదినేపల్లి: ముదినేపల్లిలోని స్వామ్ ఐటిఐ కళాశాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం 9గంటలకు శంఖుస్థాపన చేయనున్నారు. కళాశాలలో నూతనంగా రూ.25 లక్షలతో అన్నీ హంగులతో ఆధునాతనంగా నిర్మించిన కంప్యూటర్ లాబ్‌ను డిఎన్ఆర్ ప్రారంభించనున్నట్లు స్వామ్ ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ గురువారం తెలిపారు.

ఎస్ఐ సతీష్‌కుమార్‌కు అభినందనలు

టి.నరసాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కె.సతీష్ కుమార్‌ను జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ప్రశంసాపత్రం అందించి అభినందించినట్లు ఆయన గురువారం విలేకరులకు తెలిపారు. ఇటీవల బుట్టాయిగూడెం మండలంలోని పులిరామన్నగూడెం ఎస్‌టి హాస్టల్లో నాలుగో తరగతి హత్యకేసులు విచారణలో పురోగతి సాధించి, హత్య కేసు చేదించిన విషయంలో సహకరించినందుకు 25 మంది పోలీస్ సిబ్బందితో పాటు సతీష్ కుమార్‌ని కూడా ఎస్‌పి అభినందించి ఆమె ప్రశంసాపత్రాలు అందజేశారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు మానసిక సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు



కైకరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మానసిక వైద్య నిపుణురాలు హన్నా కోమలి, సామాజిక, మానసిక కార్యకర్త తిరుపతి స్వామి, భాస్కర రెడ్డి అధ్వర్యంలో మానసిక సమస్యలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. 8 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు కౌమార దశలో వచ్చే మానసిక ఆరోగ్య సమస్యలుపై అవగాహన కల్పించారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు తగిన ఎక్సర్‌సైజ్‌లు చేయించి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్కిల్ హాబ్' సేవలను వినియోగించుకోవాలి



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన నిరుద్యోగ యువత

ప్రజాశక్తి - భీమడోలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న స్కిల్ హాబ్ సేవలను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు బొమ్ము రవికుమార్ కోరారు. వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న స్కిల్ హాబ్ రెండో విడత కేంద్రంగా శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎంపికైంది. ఉంగుటూరు నియోజకవర్గ స్థాయికి ప్రత్యేకించిన స్కిల్ హాబ్‌లో గత మూడు నెలలుగా సుమారు 60 మంది నిరుద్యోగ యువత అకౌంట్ ఎగ్జిక్యూటివ్ కోర్స్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ విభాగాలలో శిక్షణ పొందారు. గురువారం కళాశాల ఆవరణలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రధాన ఆచార్యులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ ఇ.త మ్మాజీరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రస్తుతం శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు వివిధ ప్రాంతాలలో నిర్వహించే జాబ్ మేళాలు, దానిలో పాల్గొనేందుకు వచ్చే కంపెనీల వి వరాలు, జీతాలు, ఇతర సౌకర్యాలు, వివిధ అంశాలపై సంస్థలో శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు ముందస్తు సమాచారం ఇస్తామన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందిన వారిలో 15 మంది వరకూ వివిధ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో రా ష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సురేష్, కళాశాల స్పోక్స్ మెన్ జి.రాము పాల్గొన్నారు.

కార్యాలయ పనుల్లో నాణ్యతా లోపం..!

ప్రజాశక్తి - చాట్రాయి



వర్షం నీటితో కార్యాలయ లోపలి భాగం..

మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి గోడలకు రంగులు, ఆవరణాన్ని లెవెలింగ్, కార్యాలయం పైభాగానికి వర్షం పడకుండా డూమ్ ఏర్పాటు చేయడం కోసం తొమ్మిది లక్షల రూపాయలకు కాంట్రాక్టుకు అప్పగించారు. కాంట్రాక్టు దారులు నాసిరకం రంగులు గోడలకు వేయడం ద్వారా వర్షం పడగానే రంగు వెలసిపోయి గోడలు వెలగల పోతున్నాయి. కార్యాలయ పైభాగానికి అమర్చిన డూమ్ ద్వారా వర్షం పడి కార్యాలయం లోపలి భాగం నీటిమయంగా మారింది. కార్యాలయ ఆవరణలో నాణ్యతలేని పనులు వల్ల వర్షం పడగానే ఆవరణమంతా బురద గుంటలుగా మారాయి. సంబంధిత అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కార్యాలయానికి వచ్చి వె ళ్లేటప్పుడు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. తొమ్మిది లక్షల రూపాయలతో మరమ్మత్తులు చేయించినా కేవలం రెండు నెలల్లోనే నాణ్యతా లోపం వలన కార్యాలయం అధ్వానంగా మారింది. ఈ విషయమై ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్‌ను వివరణ అడగగా బిల్లు కాలేదని, బిల్లు తమ దృష్టికి రాగానే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి నాణ్యమైన మెటీరియల్‌తో శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలి

భీమడోలు : రైతులు సాగులో కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించడం, అవసరం మేరకు మాత్రమే పురుగుమందులను వినియోగించడం వల్ల సాగు ఖర్చు తగ్గుతుందని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి కోరారు. శుక్రవారం వ్యవసాయ అధికారి ఎస్‌పి వి.ఉషారాణి ఆధ్వర్యంలో మేలైన వ్యవసాయ పద్ధతుల పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమడోలు సహాయ సంచాలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికంగా పురుగుమందులు వాడటం వల్ల దాని ప్రభావం మానవాళిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వల్పకాలం లేదా దీర్ఘకాలంగా ఉండే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు రైతులు వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలను పాటించాలని కోరారు. అనంతరం రైతులు తమ విజ్ఞానాన్ని నెమరు వేసుకునేందుకు బ్యాలెట్ బాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పురుగుమందు స్ప్రేయింగ్ సమయంలో అనారోగ్యం పాలై ఇబ్బంది పడుతున్న రైతును రక్షించే విధానాన్ని డెమో రూపంలో రైతు శిక్షణా కేంద్రం ఏలూరు వ్యవసాయాధికారి కాళీమాత ప్రదర్శించారు.

ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే జగనన్న సురక్ష నిర్వహణ అని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వణుదుర్రులో గురువారం గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల గురించి ఇంతప్రేమగా, బాధ్యతగా ఆలోచించే ముఖ్యమంత్రి దేశ చరిత్రలోనే కాదు ప్రపంచంలోనే ఉండకపోవచ్చన్నారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందచేశారు. అనంతరం గుర్తుగా మొక్కను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి డిఎన్ఆర్ నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపిపి రాచూరి రాధా, మండల పార్టీ కన్వీనర్ ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి ఈడే నాగలక్ష్మీ, ఎంపిటిసి గుమ్మడి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు దాకరపు శ్రీనివాసరావు, సాయి, లేళ్ళఆంజనేయులు, డి.సతీష్, ఈడే పూర్ణచంద్రరరావు, కె.విష్ణువర్ధన్, దాసరి శ్రీను, తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి పాల్గొన్నారు.

భీమడోలు: పంచాయతీ పరిధిలోని పాతూరు, సూరప్పగూడెం ఆవాస ప్రాంతాలను అనుసంధానం చేసే ఏలూరు కాలువపై గల శిథిలమైన వంతెనను పునర్ నిర్మించాలని గ్రామస్తులు తమ గ్రామానికి వచ్చిన జగనన్న సురక్ష బృందానికి విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయ స్థాయిలో జగనన్న సురక్షను గురువారం గ్రామ సర్పంచి వెజ్జు బాలాజీ నాయుడు అధ్యక్షతను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనుమాల రామయ్య హాజరు కాగా అతిథులుగా స్థానిక ఎంపిటిసి సభ్యులు ఇంజేటి జూనియర్, భీమడోలు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఇంజెట్టి నీలిమ జూనియర్ హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయ రాజు, భీమడోలు ఎంపిడిఒ సిహెచ్ పద్మావతి దేవి పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ ఏలూరు కాలువపై గల వంతెన శిథిలావస్థకు చేరిన కారణంగా దానిపై రాకపోకలు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఈ నేపథ్యంలో మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండటం వల్ల ఆ రోడ్లు శిథిలావస్థకు చేరిందని తెలిపారు. వీటిని బాగు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులతో పాటు స్థానిక ఎంపిటిసి, గ్రామ సర్పంచి ప్రజలు లేవనెత్తిన సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ముత్తయ్య, అధికారులు పాల్గొన్నారు.

16న బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు రూరల్: ధర్మ అప్పారావు కళాశాలలో ఈనెల 16వ తేదీన బాస్కెట్‌బాల్ ఉమ్మడి కృష్ణాజిల్లా బాల బాలికల జట్లు(సబ్ జూనియర్) ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిఎస్‌సి బోస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ధృవపత్రాలతో తమను సంప్రదించాలని సూచించారు. ఎంపికైన వారు జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.